# మీకు తెలియని ముగింపు

ఆమె కిటికీ దగ్గర ముందు గదిలో నిలబడి ఏదో వారపత్రికను చూస్తోంది. గదిలో తిరిగుతున్న ఫ్యాను గాలికి ఆమె తలవెంట్రుకలు ఎగురుతూ నాట్యం చేస్తున్నాయి.

ప్రకాశవంతంగా వెలుగుతున్న ట్యూబ్‌లైటు కాంతిలో ఆమె మొహం క్లియర్‌గా అగుపడుతోంది. ఆమె చెవికి పెట్టుకున్న ఎర్ర రాతిదిద్దులు మెరుస్తూ కాంతులీనుతున్నాయి.

ఆ వెలుతురులో ఆమెను చూసి ఉలిక్కిపడ్డాడు కురంగేశ్వరరావు. అతను కిటికీ దగ్గరనించి గోడపక్కకు జరిగి, వొంగి, మరోసారి ఆమెను పరిశీలనగా చూశాడు. ఈసారి అతని అనుమానం పూర్తిగా తీరింది.

అవును. సందేహం లేదు.

ఆమె జగదీశ్వరి.

అతను ఎదురింట్లో వున్నాడు.

ఇదేమిటి? జగదీశ్వరి ఇక్కడున్నది??

ఐతే.... క్రితం రోజు వరకూ ఖాళీగా వున్న ఎదురింట్లోకి జగదీశ్వరి వాళు ) అద్దెకు వచ్చివుంటారా? అవును. అంతే ఐ వుంటుంది.

అతను భయంతో వణికిపోయాడు.

జగదీశ్వరి తనని చూసి వుంటుందనే ఆలోచన అతనికి రాలేదు. చూసి వుండదనే అనుకున్నాడు. ఆమె కిటికీ దగ్గర నిలుచుని చదువుకుంటోంది. తల త్రిపి బయటకు చూడలేదు.

ఆ కిటికీ దగ్గర నిలబడటానికి కురంగేశ్వరరావు భయపడ్డాడు. ఆమె తనని చూడడం ప్రమాదం. వీలయినంతవరకు జగదీశ్వరిని తప్పుకొని తిరగాలి. త్వరలో ఇల్లు మారాలి.

ఇలా అనుకుని అతను మధ్యగదిలోకి వచ్చాడు.

అక్కడ బట్టలు సర్దుకుంటూ అతని భార్య మనోహరి వున్నది.

"ఎదురింట్లోకి ఎవరో అద్దెకు వచ్చినట్లున్నారు" అన్నాడు కురంగేశ్వరరావు భార్యతో....

"అవును, ఇంతకుముందే చూశాను. లైట్లు వెలుగుతున్నాయి" అన్నది మనోహరి.

మనోహరి ఓ ప్రయివేటు కంపెనీలో ఉద్యోగం చేస్తోంది. కురంగేశ్వరరావు ఒక కమర్షియల్ బేంక్‌లో ఉద్యోగం చేస్తున్నాడు.

అతనికి ముందుగదిలోకి వెళ్లాలంటే భయంగా వుంది.... జగదీశ్వరి తనని చూస్తుందేమోనని చివరకు ఎలాగో జాగ్రత్తగా వెళ్లి కిటికీ తలుపులు మూశాడు. గది తలుపులను కూడా మూసినప్పుడు భార్య వచ్చి....

"ఎందుకు? తలుపులు మూస్తున్నారు" అనడిగింది.

"చలిగాలి వస్తోంది" అన్నాడతను తడుముకోకుండా....

మనోహరి అతనివైపు విచిత్రంగా చూసింది. ఎందుకంటే ఎండాకాలంలో చలిగాలి ఏమిటి?

ఆ రాత్రి కురంగేశ్వరరావుకు నిద్ర పట్టలేదు.... కనులముందు జగదీశ్వరి రూపమే కనపడింది. ఆమెను ఎదురుగా వుంచుకొని తను ఆ ఇంట్లో వుండగలడా? ఆమె తనని చూసిందంటే.... తనని సుఖంగా, ప్రశాంతంగా బతకనిస్తుందా? తను కొన్నాళ్ల క్రితం ఆమెకు చేసిన ద్రోహానికి జగదీశ్వరి తనని క్షమిస్తుందా?

క్షమించదు. తనమీద కక్ష తీర్చుకొనే అవకాశంకోసం తను ఎదురుచూస్తూ వుంటుంది. ఇప్పుడు దొరికిన ఈ అవకాశాన్ని జగదీశ్వరి తప్పకుండా ఉపయోగించుకుంటుంది. ఆమె ఒక్కసారి తన భార్య మనోహరిని కలిస్తే చాలు తన జీవితం కాలిపోవటానికి....

"నిద్ర రావటంలేదా....?" అడిగింది మనోహరి. భర్త పక్కమీద అసహనంతో అటూ ఇటూ కదలటం చూసి.

"అవును" అన్నాడతను.

"బాగా ఆలోచిస్తున్నారనుకుంటాను"

"ఏమీ లేదు"

ఆ తర్వాత ఆమె ఏమీ మాట్లాడలేదు.

చివరకు వీలైనంత త్వరగా ఆ ఇల్లు ఖాళీచేసి మరో ఇల్లు అద్దెకు తీసుకుని వెళ్లిపోవాలనే నిర్ణయం తీసుకొని ఆ రాత్రి ఎప్పటికో నిద్రపోయేడు కురంగేశ్వరరావు.

జగదీశ్వరి గురించి కురంగేశ్వరరావు ఇంతగా భయపడటానికి తగిన

కారణం వుంది. అతను కాలేజీలో చదివే రోజుల్లో జగదీశ్వరి వాళ్ల వీధిలోనే వుండేది నరసరావుపేటలో. అతను ఆమెతో కొన్నాళ్లు ప్రేమ వ్యవహారం సాగించాడు. ఆమెను తను గాఢంగా ప్రేమిస్తున్నాననీ, ఆమె లేకుండా బతకలేననీ చెప్పి ఆమెను బాగా నమ్మించాడు. యవ్వనంలోకి అడుగుపెట్టిన తర్వాత తన జీవితంలో ప్రేమించానంటూ ప్రవేశించిన తొలి ప్రేమికుడు కురంగేశ్వరరావు మాటలను సులభంగా నమ్మింది జగదీశ్వరి. అతడు కోరినట్లు నడుచుకుంది. ఆమె అమాయకత్వాన్ని తనమీద ఆమె వుంచిన నమ్మకాన్ని ఆసరాగా తీసుకొని కురంగేశ్వరరావు ఆమె వయసును బాగా దోచుకొని చివరకు మొహం చాటేశాడు. ఆమె తనని పెళ్లి చేసుకొమ్మని అడిగితే నవ్వి వూరుకున్నాడు.

చివరకు కురంగేశ్వరరావు తండ్రికి ఆ వూరునుంచి ఒంగోలుకు బదిలీ కావటంతో జగదీశ్వరికి పూర్తిగా దూరమైనాడు. తర్వాత అతనికి ఒక బేంక్‌లో ఉద్యోగం వచ్చింది. కోరుకున్న కట్నంతో మనోహరితో పెళ్లయింది.... ఇప్పుడు గుంటూరులో భార్యతో సుఖంగా కాపురం చేస్తున్నాడు.

కానీ తలవని తలంపుగా జగదీశ్వరి అతని ఎదురింట్లోకి అద్దెకు దిగి అతనికి మనసులో అశాంతిని రేపింది.

తెల్లవారిన తర్వాత కూడా బయటకు రావటానికి చాలా భయపడ్డాడు. అతను మార్నింగ్ వాక్‌కి కూడా వెళ్లలేదు. ఇంటి ముందు ముగ్గుపెడుతూ జగదీశ్వరి కనపడుతుందేమోనని భయమేసింది.

అతను ఆ ఉదయం జాగ్రత్తగా చూసుకొని బయటకు వచ్చి గబగబా నడిచి బేంక్‌కు వెళ్లాడు. ఆరోజునే ఎక్కడయినా ఒక అద్దె ఇంటిని చూడమని తన స్నేహితులకు చెప్పాడు.

ఉదయం పదిన్నర దాటుతున్నప్పుడు బయటకు వచ్చింది మనోహరి ఏదో కొనటానికి. అప్పుడు చూసింది ఎదురింటి గేటుకు వేళ్లాడుతున్న నేమ్ ప్లేట్‌ని. పెద్ద పెద్ద అక్షరాలు రాసి వున్నాయి. యస్. ఆనందరావు కమర్షియల్ డిపార్ట్‌మెంట్ అని రాసి వుంది. ఒకటికి రెండుసార్లు ఆ బోర్డుమీది అక్షరాలను చదివింది మనోహరి. ఆమె తిరిగి ఇంట్లోకి వెళ్లబోతున్నప్పుడు ఎదురింట్లోనించి ఒకతను బయటకు వచ్చాడు.... కొంచెం సన్నగా, పొడుగ్గా వున్నాడు. వెనక్కు దువ్విన హైరోడ్డు క్రాపు, గద్ద ముక్కు, వొత్తుగా వున్న వెడల్పాటి మీసాలు, నుదుటిమీదకు పీక్కున్నట్లు వున్న కొంచెం జుట్టు, నీలంరంగు ప్యాంటులోకి తెలుపు మీద నల్ల గీతలున్న పొడుగు చేతుల షర్టుని దోపుకొని వెడల్పుగా వున్న బెల్టును పెట్టుకున్నాడు.

చేతిలో ఒక తోలుసంచీని పట్టుకొన్నాడు. ఆఫీసుకు వెళుతున్నట్లున్నాడు. అతడిని చూసి.... గబగబా లోపలకు వచ్చింది మనోహరి.

ఆపైన పది నిమిషాలకు జగదీశ్వరి - మనోహరి ఇంట్లోకి వచ్చి తనని పరిచయం చేసుకున్నది.

"నా పేరు జగదీశ్వరి. నిన్న సాయంత్రం మీ ఎదురింట్లోకి అద్దెకు దిగాము. ఆయనకు నెల్లూరు నించి ఇక్కడకు ట్రాన్స్‌ఫర్ అయింది" అని చెప్పి ఇంకా ఏవో విషయాల గురించి ఇంకో పది నిమిషాలు మాట్లాడి వెళ్లబోతూ "మీరు కూడా మా ఇంటికి రండి" అని ఆహ్వానించి వెళ్లిపోయింది.

జగదీశ్వరి వెళ్లిపోయిన చాలాసేపటి వరకూ మనోహరి ఏదో ఆలోచిస్తూ ఉండిపోయింది.

ఆ రాత్రి రోజూలా కాకుండా కొంచెం పొద్దుపోయిన తర్వాత ఇంటికి వచ్చాడు కురంగేశ్వరరావు. అతను అప్పటికే అక్కడకు బాగా దూరంగా వుండే ప్రాంతంలో అద్దెకు ఇచ్చే ఖాళీగా వున్న రెండు ఇళ్లను చూసి వచ్చాడు.

"ఇంత ఆలస్యమయిందేం?" అడిగింది మనోహరి.

"ఫ్రెండు ఇంట్లో కూర్చున్నాను...." అబద్ధం చెప్పాడతను.

భోజనాలు చేసి పడుకున్న తర్వాత జగదీశ్వరి తమ ఇంటికి వచ్చిన విషయాన్ని చెప్పింది మనోహరి తన భర్తతో....

"ఏమన్నది ఆమె?" కుతూహలంగా అడిగాడు.

"ఈ ఏరియాలో వీళ్లకు ఇబ్బందిగా వుంటుందా? అని అడిగింది.

"ఇంకా ఏమడిగింది?" మళ్లీ అడిగాడు.

"ఏమడిగింది?" కంగరుగా అడిగాడు.

"మీవారు ఏం చేస్తారని అడిగింది"

అతను నవ్వి "ఇంతేనా....!" అన్నాడు తేలిగ్గా.

"జగదీశ్వరి గురించి నీ అభిప్రాయం ఏమిటి?" కురంగేశ్వరరావు అడిగాడు.

"ఆమె పేరు మీకెలా తెలుసు....?" ఆశ్చర్యంగా అడిగింది.

"ఇంతకుముందు నువ్వే చెప్పావుగదా"

"నేను చెప్పానా? గుర్తులేదు. మీరు బాగా గుర్తుపెట్టుకున్నారు. ఇంతకీ మీరు ఆమెను చూశారా?"

"చూడలేదు. అందంగా వుంటుందా?"

"నాకంటే బాగానే వుంటుంది" అన్నది నవ్వి.

"నేను నమ్మను" అన్నాడు కొంచెం నటిస్తూ.

"పోన్లెండి.... నాకలా అనిపించింది" అని "మీతో ఒక విషయం చెప్పాలి. ఒప్పుకుంటారా?" అన్నది మనోహరి.

"ఏమిటా విషయం?"

"మనం త్వరగా ఈ ఇల్లు మారి ఇంకో ఇంట్లోకి వెళదామా?...." అనడిగింది మనోహరి.

కురంగేశ్వరరావు అమితంగా ఆశ్చర్యపడి తర్వాత....

"ఎందుకు? ఇప్పుడు అంత అవసరం యేముంది?" అనడిగాడు.

"ఎందుకంటే సరిగ్గా చెప్పలేను. నాది సిల్లీ రీజనే కావచ్చు. ఎందుకో నాకు ఆ జగదీశ్వరిని చూస్తుంటే మామూలు మనిషిలా అనిపించలేదు.... కొంచెం స్పీడు ఎక్కువ మనిషిలా అనిపించింది. ఆమెవల్ల భవిష్యత్తులో మన మధ్య కలతలు వస్తాయేమో అనిపించింది. అలా రావటం నాకిష్టం లేదు. నా కాపురాన్ని నేను నిలబెట్టుకోవాలికదా" అన్నది చిన్నగా తల వంచుకుని.

అప్పుడు కురంగేశ్వరరావు మనసులో చాలా సంతోషపడ్డాడు. ఆ సంతోషాన్ని బయటకు కనబరచకుండా.

"మన మధ్య కలతలు రావటం నాక్కూడా ఇష్టం లేదు. రేపే ఒక ఇంటిని చూస్తాను బేంక్‌కు సెలవు పెట్టి. ఆ జగదీశ్వరితో మాట్లాడకు" అన్నాడు తీవ్రంగా నటిస్తూ. అంతేగానీ తన భార్య మనోహరి తనతో అబద్ధం చెప్పి వుంటుందనే ఆలోచన అతనికి రాలేదు. ఎలాగంటే....

గతంలో కొన్నాళ్ల క్రితం మనోహరి, జగదీశ్వరి భర్త ఆనందరావు ప్రేమికులనీ, ఆనందరావు కారణంగా కడుపు తెచ్చుకుని మనోహరి ఎబార్షన్ కూడా చేయించుకున్నదనీ, అందువల్ల ఇద్దరూ విడిపోయారనే నిజం.... కురంగేశ్వరరావుకు తెలీదు.

అందువల్లనే మనోహరి ఇల్లు మారదామని అన్నది. ❖

*మల్లెతీగ మాసపత్రిక, ఆగష్టు 2008*